దారిదోపిడి కేసులో 9 మంది అరెస్ట్: పరారీలో మరొకరు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అల్లూరి జిల్లా పెదబయలు వారపు సంతలో బట్టల వ్యాపారం చేస్తున్న వ్యక్తి కారును వెంబడించి, అందులో ఉన్న వ్యక్తులను కొట్టి, వారి వద్ద నుంచి 38 వేల రూపాయలు దోపిడీ చేసిన కేసులో 9 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు ఎస్పీ కే.వీ.మురళీకృష్ణ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. విశాఖపట్నం పూర్ణ మార్కెట్ ప్రాంతంలో గల వెలంపేటకు చెందిన ముప్పిడి మహేష్ వారపు సంతల్లో బట్టల వ్యాపారం చేస్తూ ఉంటాడని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 19న విశాఖ నుంచి తన తండ్రి రాంబాబుతో కలిసి కార్ డ్రైవర్ నాగరాజు, వారి వద్ద పనిచేసే సతీష్‌లు కారులో బట్టలు పట్టుకొని పెదబయలు వారపు సంతకు వెళ్లారు. మహేష్‌కు చెన్నైలో పని ఉండడంతో మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో నలుగురు కలిసి అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు కారులో బయలుదేరగా పాడేరు దాటిన తర్వాత అనకాపల్లి గవరపాలెం ప్రాంతానికి చెందిన ఎల్లపు నూకేష్, మొల్లేటి లోకేష్‌లు స్కూటీపై కారును వెంబడించాలని తెలిపారు. కారు వెంకన్నపాలెం జంక్షన్ దాటిన తర్వాత మరో ముగ్గురు బైక్ పై వెంబడించి అనకాపల్లి మండలం బవులు వాడ జంక్షన్‌కు వచ్చేసరికి పదిమంది కారును ఆపినట్లు తెలిపారు. కారులో గంజాయి ఉందంటూ నలుగురు వ్యక్తులపై దాడి చేసి, మహేష్ వద్ద 18000 రూపాయల నగదు, అతని తండ్రి రాంబాబు వద్ద ఉన్న 20000 తీసుకున్నట్లు తెలిపారు. ముద్దాయి దివాకర్ నలుగురిని కారులో ఎక్కించుకొని డైట్ కాలేజీ సమీపంలో తీసుకెళ్లి పదిమంది నిందితులు నలుగురు వ్యక్తులపై దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి 16 గంటలు గడవకముందే 9 మంది నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసామని తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. 16 గంటలకు ముందే కేసును చాకచక్యంగా చేదించిన సిఐ రవికుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో డిఎస్పి సుబ్బరాజు ఉన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి: బాలేపల్లి

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి, స్మార్ట్ మీటర్లు బిగించడానికి వ్యతిరేకంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు అధ్యక్షతన అఖిలపక్ష పార్టీలు చోడవరం వాకర్స్ క్లబ్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, విద్యుత్ చార్జీలను మరియు తర్ఫీ చార్జీలను పేరుతో ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు రానున్న రోజుల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ నెల 30న అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టాలని, పెంచిన చార్జీలు తగ్గించే వరకు పోరాడాల్సిందిగా పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల పేరుతో రైతాంగాన్ని, ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. జనసేన నాయకులు జెర్రిపోతుల నానాజీ, రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్, రాజాన దొరబాబు, కాసుబాబు, విస్సరువు నాగూరు గోవాడ కనకమాలక్ష్మి ద్వారపూడి నాగేశ్వరరావు, మల్లు నాయుడు మరియు మహిళా సమైక్య నాయకులు రమేషు పాల్గొన్నారు

2న సింహాచల గిరి ప్రదక్షిణ: కలెక్టర్ మల్లికార్జున

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సింహాచలం దేవస్థానం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వార్షిక 'గిరి ప్రదక్షిణ' 'ఆషాఢ పౌర్ణమి' జూలై 2, 3 తేదీలలో జరుగనున్న దృష్ట్యా అధికారులు పటిష్ట ఏర్పాట్లను గావించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. జులై 3వ తేది సోమవారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా నాలుగో విడత చందన సమర్పణ జరుపబడునని అన్నారు. ఈ సందర్భంగా ముందు రోజున జూలై 2వ తేదీన సింహాచల క్షేత్రంలో లక్షల సంఖ్యలో భక్తులు గిరిప్రదక్షిణ సేవా నిర్వహించబడునని పేర్కొన్నారు. సుమారు 32 కిలోమీటర్లు దూరం గిరి ప్రదక్షణ ప్రారంభించి అడవివరం జంక్షన్ మీదుగా సెంట్రల్ జైలు, విశాలాక్షి నగర్, జోడుగుల్ల పాలెం, ఎం వి పి కాలనీ డబుల్ రోడ్డు మీదుగా వెంకోజీపాలెం, మాధవధార, ప్రహ్లాదపురం గోశాల మీదుగా తిరిగి స్వామివారి కొండ దిగువ తొలి పావంచాకు చేరుకుంటారని అన్నారు.

ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, సింహాచలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఇంచార్జి ఇ.ఓ భ్రమరాంబ, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, సింహాచల దేవస్థానం ఈవో భ్రమరాంబ, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, దేవాదాయశాఖ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ కార్మికులకు భద్రత కల్పించండి

విశాలాంధ్ర - అరకులోయ: జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో, గురుకులాల్లో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్‌లకు భద్రత కల్పించాలని సీఐటీయూ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం అరకులోయ గురుకుల కళాశాలలో వంట కుక్‌గా పనిచేస్తున్న బుద్దు వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలి గాయపడ్డాడని తెలుసుకొని మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా హాస్టల్ కార్మికులకు ఉద్యోగ భద్రత, గ్రూప్ ఇన్సూరెన్స్, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ఉద్యమాలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా గిరిజన ఆశ్రమాలు, గురుకులాల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని తక్షణం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడిన కార్మికులకు ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వచ్చే వారం నుండి ప్లాస్టిక్ నిషేధం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండలంలో ప్లాస్టిక్ కవర్లు వచ్చే సోమవారం నుండి పూర్తిగా నిషేధిస్తున్నామని ఎంపీడీవో ఆర్వీఎస్ రమేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో గల వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లు విక్రయించడం పూర్తిగా విడిచిపెట్టాలని ఆయన అన్నారు. మండలంలో వచ్చే సోమవారం నుండి ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధిస్తున్నామని వ్యాపారస్తులు గమనించుకొని ప్లాస్టిక్ కవర్లు అమ్మినట్లయితే 500 నుండి 1000 రూపాయల వరకు జరిమానా విధిస్తామన్నారు. మండలంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తున్నట్లు ప్రతి వ్యాపారస్తుడికి నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శి గోపికి ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, టైపిస్ట్ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్మాణానికి స్థల పరిశీలన

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం శొంఠ్యం గ్రామపంచాయతీ పరిధిలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టీటీడీ సౌజన్యంతో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించబోతున్న రెండు దేవాలయాలకు స్థల పరిశీలన చేపట్టారు. వైయస్సార్ కాలనీ గొంతుని వానిపాలెం దుర్గాలమ్మ గుడి వద్ద నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్ట్ సూపరింటెండెంట్ శర్మ, పురాణ పండిత్ సత్యనారాయణ స్థల పరిశీలన చేసి ఒక్కొక్క దేవాలయానికి ట్రస్టు ద్వారా 10 లక్షలు చొప్పున నిధులు అందజేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు సర్పంచ్ లెంక రాంబాబు, ఎంపిటిసి పల్లారమణ, కోరాడ వెంకటరమణారావు, గిరి రాజు, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు రౌతు శ్రీను, రవి, గవర ఈశ్వరరావు స్వామినాయుడు, సిహెచ్ వెంకటరమణ, పాపునాయుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సదుపాయం కల్పించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం, జీనబాడు పంచాయతీ పరిధిలో గల వలసల గురువు గిరిజన గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని జై భారత్ ఎస్టీ పోరాట వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు, నవీన చైతన్య సాధికారిత అభివృద్ధి సమితి (నీడ్స్) రాష్ట్ర కన్వీనర్ రేగం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన వలసల గురువు గ్రామంలో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక గిరిజన మహిళలను అడిగి తెలుసుకున్నారు. వలసల గురువు గ్రామంలో 15 గిరిజన కుటుంబాలు వారు ఒక వైపు దట్టమైన కొండలు మరో వైపు రైవాడ జలాశయం నడుమ నివాసం వుంటున్నాయని అన్నారు. గ్రామంలో ఇప్పటికి గత, ప్రస్తుత ప్రభుత్వం ఒక్క చేతి బోరు కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు లేవన్నారు. ఊట నీరు రాకపోతే పక్కనే ఉన్న రైవాడ జలాశయ కలుషితమైన నీటినే గ్రామస్తులు సేవించే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు జి.గణేష్, టి.కొండబాబు, ఎస్.భీమన్న, జి.వరలక్ష్మి, టి.సన్యాసమ్మ, ఎస్.చంద్రమ్మ, మహిళలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - పరవాడ: జగనన్న సురక్షను విజయవంతం చేయాలని మండల జడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు పిలుపునిచ్చారు. వెన్నెలపాలెం కళ్యాణ మండపంలో బుధవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పర్యవేక్షణ బృందాలకు జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ఇతరత్రా లబ్ధి పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలను జారీ చేసేందుకు జూలై 1 నుంచి వారంలో మూడు రోజుల చొప్పున 5 వారాలు గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష జరుగుతుందన్నారు. శిబిరం నిర్వహణకు వారం ముందు వలంటీర్లు తమ పరిధిలోని ఇంటింటికీ తిరిగి ప్రజావసరాలకు అనుగుణంగా ఏయే ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నది తెలిపి వారిని శిబిరం వద్దకు వచ్చేలా సన్నాహాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి హేమసుందరావు, తహసిల్దార్ పి.కనకారావు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని కేంద్ర పోర్టులు షిప్పింగ్, జలరవాణా, ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. విశాఖ పోర్టు అథారిటీ పరిధిలోని విశాఖ కంటైనర్ టెర్మినల్ 2లో బుధవారం యోగాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మరోవైపు అక్కయ్య పాలెం పోర్టు స్టేడియంలో సైతం పోర్టు ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పోర్టు ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సీఐఎస్ ఎఫ్ సిబ్బంది, కంటైనర్ టెర్మినల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో ఆహూతులతో యోగాసనాలు వేయించారు. పోర్టు చైర్మెన్ డా ఎం.అంగముత్తు మాట్లాడుతూ యోగా వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని అనేక రోగాలను దూరంగా ఉంచవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎంపి జివిఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్ స్వామి, కార్యదర్శి టి.వేణుగోపాల్, విభాగాధిపతులు పలువురు బీజేపీ నేతలు పాల్గొన్నారు.

విశాఖ సిటీ: యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ సిల్వర్‌జూబ్లీ మైదానంలో రోటరీక్లబ్స్ విశాఖపట్నం, ఏయూ యోగా కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర శిక్ష విభాగం సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యోగాకు నేడు ప్రాధాన్యత పెరిగిందన్నారు. భారత ప్రభుత్వం దీనిని గుర్తించి యోగాను నూతన విద్యవిధానంలో భాగంగా మార్చిందన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.మల్లికార్జున మాట్లాడుతూ యోగా మానవ ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. దేశ ప్రధాని కృషితో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. విభిన్న ప్రతిభావంతులను భాగం చేస్తూ నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. వారికిసైతం యోగాను నేర్పించాలనే ఆలోచనను అభినందించారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రాచీనకాలం నుంచి భారతీయుల సంపదగా యోగా నిలుస్తోందన్నారు. అనంతరం దివ్యాంగ చిన్నారులతో కలసి యోగ సాధన చేసారు. కార్యక్రమంలో డిఈఓ ఎల్.చంద్రకళ, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహ రావు, రొటేరియన్స్ మల్లిక, పి.శ్రీధర్, విద్యాసాగర్, యోగా విభాగం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్ భానుకుమార్, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ చిట్టూరి శ్రావణి, యోగా విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొమ్మాది: ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ జోన్-2 ఏడో వార్డు పరిధిలోని మల్లయ్యపాలెం క్రీడా మైదానంలో ఆకార్, అమ్మఒడి, ఆరోగ్య బాల, బాలికల సంరక్షణ కేంద్రాల విద్యార్థులతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సిహెచ్ విశాలాక్షి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా అనేది ప్రతి వ్యక్తి జీవితంలో ఒక నిత్య ప్రాణాలికగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ ఉపాధ్యక్షులు దీనబంధు, సెక్రెటరీ శ్రీనివాస్ మూర్తి, యోగ గురువులు గీతా గ్రిష్, కనకదుర్గ, పుష్పలతలు పాల్గొన్నారు.

మధురవాడ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వ విద్యాలయంలోని కోడి రామమూర్తి ఇండోర్ స్టేడియంలో జరిగిన యోగా దినోత్సవంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, కేంపస్ లైఫ్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పరిమళవేణు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణరావు తదితరులు పాల్గొని స్వయంగా యోగ, ధ్యాన ప్రక్రియలను ప్రదర్శించారు. గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) ఆవరణంలో వైద్య విద్యార్థులు యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమణరావు, జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ పాల్గొన్నారు.

తగరపువలస: తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డొకర శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల హిందీ ఉపాధ్యాయులు, యోగా గురువైన టి.ఎస్.వి.ప్రసాదరావు సుమారు 400 మంది విద్యార్థులతో యోగా చేయించారు. పాఠశాల యోగ గురువు టి.ఎస్.వి. ప్రసాదరావు మాట్లాడుతూ భారతదేశానికి పుట్టినిల్లు అయినటువంటి యోగ నేడు ప్రపంచ దేశాల్లో ఎంతో ప్రతిష్టను చాటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జె.అప్పలనాయుడు, చంద్రశేఖర్, సూర్యనారాయణ, తారకేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు జి.ప్రసాదరావు, ప్రభావతి, విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి: మండలంలో శ్రీ సరస్వతి విద్యా విహార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆనందపురం మహాత్మా గాంధీ పువ్వుల మార్కెట్ నందు గల మార్కెట్ యార్డులో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ విశాఖ జిల్లా ప్రచారక్ తమ్మిన నర్సింగరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. యోగా రోజువారి చేయడం వల్ల శరీరం దృఢంగా ఆరోగ్యవంతంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ దుక్క అప్పలరాజు, సామాజిక గ్రామీణ వైద్య జిల్లా కార్యదర్శి కే.నారాయణరావు, వేములవలస మాజీ సర్పంచ్ కోరడ అప్పలస్వామి నాయుడు, పి సూర్యనారాయణ, ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్య సంఘం అధ్యక్షులు జంగం జోషి, తదితరులు హాజరయ్యారు.

కూర్మన్నపాలెం: దువ్వాడలోగల విజ్ఞాన్ లో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా డా.వి.మధుసుధనరావు రెక్టార్ మాట్లాడుతూ ప్రపంచం అంతా ఒకే కుటుంబం అని తెలుపుతూ, యోగ అంటే ఐక్యం అని, మనిషిని తను చేరుకోగల అత్యున్నత స్థితికి చేరవేసే ఒక సంపూర్ణ సాంకేతిక పరిజ్ఞానం అని తెలిపారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.జె.సుధాకర్, వి.వి.విజయలక్ష్మి, యోగా ట్రైనర్ అనిత, డా.వి.మధుసుధనరావు రెక్టార్, సి.ఇ.ఒ ఎన్.శ్రీకాంత్ డా.జె.సుధాకర్ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ డా.పి.ఎస్.రవీంద్ర, ఎన్.ఎస్.ఎస్. ప్రొగ్రామ్ ఆఫీసర్ డా.ఆర్.సుందర రామమ్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ డా.బి.సతీష్, అసోసియేట్ డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ జి.హిమబిందు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ డిపార్టుమెంట్ అధ్యాపకులు డా.పి.వి.రమణ, సిహెచ్.రాంబాబు పాల్గొన్నారు.

పద్మనాభం పంచాయతీలో పలు సమస్యలపై ఫిర్యాదు

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభ మండలం పద్మనాభం పంచాయతీలో ఇసుకలపాలెం, పద్మనాభం, అరుచుకుని పాలెం మూడు గ్రామాలలో గత కొన్ని నెలలుగా వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేదని, మురుగు కాలువల్లో చెత్త పేరుకుపోయిందని తదితర సమస్యలపై ఎంపీడీఓకు ప్రజలు ఫిర్యాదు చేశారు. పద్మనాభం గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన నక్కిన రవి మాస్టారు ఇంటి దగ్గర నుంచి వేసినటువంటి మంచినీటి పైపులైను దగ్గర గత ఏడాది దీపోత్సవంలోని లైటింగ్ కోసం పెద్దపెద్ద గుంతలు తవ్వి ఇప్పటివరకు పూడ్చలేదని తెలిపారు. సుమారు 7 నెలల నుంచి వృధాగా మంచినీరు పోవుచున్నా దానిపై అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం శ్రద్ధ చూపడం లేదన్నారు. పద్మనాభం మెయిన్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు రోడ్డు ప్రక్కల రోడ్డు మీదగా మురికి నీరు ఎక్కువ ప్రవహిస్తుండడం వల్ల పద్మనాభం ఎండల కేంద్రం అవుట్ వల్ల రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు అడ్డే లేదా....!

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని అరకు పంచాయతీ గ్రామంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. 1/70 చట్టానికి విరుద్ధంగా శాశ్వత భవనాలు, దుకాణాలు నిర్మాణాలు చేపడుతున్నా వాటికి అడ్డుకట్ట వేయాల్సిన పంచాయతీ, రెవిన్యూ శాఖ అధికారులు నిమ్మకు నీరెతినట్లు వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. అరకు సంత బయలులోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఆనుకొని ఉన్న స్థలంలో ఓ గిరిజనేతరుడు బహిరంగంగా బినామీ పేరుతో అక్రమ నిర్మాణం చేపడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆ గ్రామ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని అధికారులు పరిరక్షించబోయి, అక్రమ నిర్మాణదారులకు రహస్య మద్దతు ఇవ్వడం సరికాదని గిరిజనులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గిరిజనేతరుల అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని అరకు పంచాయతీ గ్రామ గిరిజనులు కోరుతున్నారు.

నిలిచిన రిజిస్ట్రేషన్లు

విశాలాంధ్ర - నక్కపల్లి: క్రయ విక్రయ తది తర లావదేవిల రిజిస్ట్రేషనులకు ఆధార్ కేవైసీ తప్పనిసరి కావడంతో బుధవారం ఉదయం నుంచే సాంకేతిక సమస్యలు తలె త్తడంతో ఈకెవైసి అవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలా చోట్ల రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయి. ఈ మేరకు స్థానిక సబ్ రిజిస్ట్రారు జిలాని బేగం సంప్రదించగా రాష్ట్రంలో ఎక్కడా ఈకెవైసీ పనిచేయడం లేదని, దీనిపై అధికారులకు తెలి యపర్చడం జరిగిందని, మరికొన్ని గంటలలో పనిచేయవచ్చునని తెలిపారు. గత కొన్ని రోజు లుగా తరుచూ సాంకేతిక సమస్యలు వస్తున్నా యని రిజిస్ట్రేషన్లకు వచ్చేవారు వాపోయారు.

భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్రకు ఏర్పాట్లు

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిష్యత్తు గ్యారంటీ బస్సు యాత్ర ఉత్తరాంధ్రలో గురువారం అనకాపల్లి జిల్లా, పాయకరావుపేట నుండి ప్రారంభం కానుంది. ఉదయం పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభిస్తారు. అనంతరం పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం సమీపంలో పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తారు. అనంతరం పాయకరావుపేట, నక్కపల్లి, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం మీదుగా బస్సుయాత్ర కొనసాగుతుంది. రాత్రికి జెవిపాలెంలో పల్లెనిద్ర నిర్వహిస్తారు. పాయకరావుపేటలో జరిగే బహిరంగ సభకు సంబందించిన ఏర్పాట్లను స్థానిక తెలుగుదేశం నాయకులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, కశింకోట సత్తిబాబు, చిరుకూరి పేర్రాజు, గంపల చినరాజు, చౌదరి, రాజు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడంలో ముందుండాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: ఈనెల 23 నుండి జూలై 23 వరకు జరుగు జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రజలకు సేవలు అందించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి సుభాష్ తెలిపారు. బుధవారం సూది వలస గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బందితో కలెక్టర్ సమీక్ష జరిపారు. జగనన్న సురక్షలో ప్రజల నుండి వచ్చే ఎటువంటి సమస్యలైనా పరిష్కరించవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా మరణ ధ్రువీకరణ పత్రం, ఆదాయ, వివాహ పత్రాలు, భూముల మ్యూటేషన్లు వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగుల పనితీరును వారి యొక్క రికార్డులను తనిఖీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామంలో ఉన్న కొత్తచెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. చెరువు చుట్టూ గట్టు వెంబడి 200 కొబ్బరి మొక్కలను నాటారు. పంచాయతీ ఆధ్వర్యంలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేయాలని సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసి నాయుడును ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎంపీటీసీ వబ్రీ రామనాయుడు, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, తహశీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో శచిదేవి తదితరులు పాల్గొన్నారు.

SBFC | SMALL BUSINESS FINCREDIT

ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటీఎస్ నం.95ఏ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059 (టెలిఫోన్ : +91 22 67875300), ఫ్యాక్స్: +91 22 67875334 (WWW.SBFC.COM) కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య:యు67190ఎంహెచ్2008పిటిసి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తేదీ: 28 జూన్, 2023 - ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.

వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎక్కౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎక్కౌంట్లకు చెందినవి.

వైజాగ్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నెం.43-9-205, గ్రౌండ్‌ఫ్లోర్, సుబ్బలక్ష్మినగర్, మోర్ సూపర్‌మార్కెట్ ఎదుట, భగీరథహోటల్ పక్కన, దొండపర్తి.
వైజాగ్: AP00081651,AP00208183,AP00313751,AP00354371,AP00376774,AP00401087,AP00415115,AP00491249,AP00497409,AP00519409

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సంప్రదించు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కలిగియున్నది.

ఐరన్‌మెన్‌తో తెలుగు టాలన్స్ 'టై'

విశాలాంధ్ర -విశాఖ సిటీ : ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పీహెచ్‌ఎల్) అగ్ర జట్ల నడుమ ముఖాముఖి పోరు 'టై'గా ముగిసింది. ఆఖరు క్షణం వరకు ఉత్కంఠగా సాగిన తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ గ్రూప్ దశ మ్యాచ్ 30-30తో ముగిసింది. చివరి నిమిషంలో 30-28తో ఐరన్‌మెన్ రెండు గోల్స్ ఆధిక్యంలో నిలిచి గెలుపై దీమాగా కనిపించినా.. చివరి 60 సెకండ్లలో తెలుగు టాలన్స్ అసమాన ప్రదర్శన చేసింది. రాహుల్ నైన్ మెరుపు గోల్‌తో టై ఆశలు సజీవంగా నిలుపగా.. ఆఖరు క్షణంలో కైలాష్ పటేల్ కండ్లుచెదిరే గోల్‌తో మెరిశాడు. దీంతో 30-30తో ఐరన్‌మెన్‌తో టాలన్స్ మ్యాచ్ టైగా ముగిసింది. పీహెచ్‌ఎల్ గ్రూప్ దశ మ్యాచుల్లో ఇది రెండో టై కావటం విశేషం. తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ చెరో పాయింట్ పంచుకున్నాయి. 9 మ్యాచుల్లో ఏడు విజయాలు, ఓ టైతో 15 పాయింట్లతో ఐరన్‌మెన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువగా.. 9 మ్యాచుల్లో ఆరు విజయాలు, ఓ టైతో తెలుగు టాలన్స్ 13 పాయింట్లు సాధించి రెండో స్థానంలో కొనసాగుతుంది. తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ ఇప్పటికే సెమీఫైనల్స్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. తెలుగు టాలన్స్ గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో నేడు గార్విట్ గుజరాత్‌తో పోటీపడనుంది.

పాల్తేరులో పశువులపై కుక్కల దాడి

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పాల్తేరు గ్రామంలో కుక్కలు వీధుల్లో విచ్చల విడిగా తిరుగుతూ పశువులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయని గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను అరికట్టాలని గ్రామ పంచాయతీలో రైతులు, యువత ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గత 10రోజులుగా గ్రామంలో కుక్కలు విపరీతంగా తిరుగుతూ పశువులను, మనుషులను కరుస్తున్నాయని తెలిపారు. గ్రామానికి చెందిన పిండి నరసయ్యకు చెందిన పశువులను కుక్కలు కరిచి గాయపరిచాయని తెలిపారు. వీధుల్లో తిరుగుతున్న పిల్లలను, పెద్దలను వెంట పడి కరుస్తున్నాయని వాపోయారు. కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌ను వివరణ కోరగా కుక్కలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగనన్న సురక్ష పథకంపై వాలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర - పాయకరావుపేట: జగనన్న సురక్ష పథకంపై మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో 9 సచివాలయాలు 4గ్రామాలకు చెందిన వాలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎంపీడీఓ సాంబశివరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం జూలై 1వ తేదీ నుండి ప్రారంభమవుతుందని తెలిపారు. వాలంటీర్లు వారి పరిధిలోని 50కుటుంబాల్లో ఎవరికైనా దృవపత్రాలు అవసరమైతే ముందుగానే వారి వద్ద నుండి దరఖాస్తులు తీసుకుంటే గ్రామాల్లో జరిగే సమావేశంలోనే దృవపత్రాలు అందజేస్తారని తెలిపారు. ఆదాయ, కుల, మరణ, పుట్టుక, మ్యుటేషన్, ఫ్యామిలీ మెంబర్ దృవపత్రాలు, ఆధార్‌కార్డులో మొబైల్ నెంబరు అప్‌డేట్, కౌలు రైతు గుర్తింపు కార్డులు, ప్రభుత్వ డేటాలో పేర్లు తొలగింపు తదితర దృవపత్రాలు అందజేస్తారని తెలిపారు. ప్రజల వద్దకు అధికారులు వచ్చి 11రకాలు సేవలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అవసరమైన వారు ఉపయోగించుకునే విధంగా వాలంటీర్లు వారి పరిధిలో 50కుటుంబాల వారికి అవగాహన కల్గించాలని ఎంపీడీఓ సాంబశివరావు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

యువత స్వయం శక్తితో ఎదగాలి

విశాలాంధ్ర - ఆనందపురం: యువత ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టిని సాధించాలని భీమిలి నియోజకవర్గం వైయస్సార్సీపి ఇంచార్జ్ ముత్తంశెట్టి మహేష్ అన్నారు. బుధవారం ఆనందపురం కూడలి బీపీ కల్లాలు రోడ్‌లో విద్యావేత్త, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకర సురేష్ కుమార్, లహరి ఏర్పాటు చేసిన మండలంలో మొట్టమొదటి ది ఐ స్కూల్ (ప్లే స్కూల్)ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రాష్ట్రానికి మూల స్తంభాలాంటి వారని కాబట్టి స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. జడ్పిటిసి కోరాడ వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇటువంటి స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకొని రాణించి ఉన్న స్థాయికి చేరుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బంటుపల్లి మణిశంకర్ నాయుడు, మండల వైకాపా వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, వైస్ ఎంపీపీ బొట్ట ధనలక్ష్మి రామకృష్ణ, సీనియర్ నాయకులుకాకర వెంకటరమణ,విన్నింటి వెంకటరమణ, చందక సూరిబాబు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బి ఆర్ బి నాయుడు, ఉప్పాడ లక్ష్మణరావు, కే దామోదర్ రావు,కే చంద్రమౌళి,ఉప్పాడ సూరిబాబు, వానపల్లి ముత్యాలరావు,మీసాల రాము నాయుడు,లోడగల రమణ, మహంతి శివాజీ, ఏ దేవుడు బాబు, కే వైకుంఠ, బి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

భార్య భర్తల మనస్పర్థలతో పసికందుకు శాపం

అక్కున చేర్చుకున్న ఐసిడిఎస్ సిబ్బంది

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: భార్య భర్తల మనస్పర్థల కారణంగా పసికెందుకు శాపంగా మారిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రంగేలి సింగ్ గ్రామానికి చెందిన పాంగి. రామరాజు, గౌరీ అనే దంపతులకు ఈనెల 15న ఆడబిడ్డ జన్మించింది. ఆసుపత్రిలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు తలెత్తడంతో తల్లి గౌరీ పసికందును పట్టుకొని ఇంటికి వెళ్లి పసికందును వదిలి వెళ్ళిపోయింది. అమ్మమ్మ అక్కున ఉన్న పసికందు ప్రాణాపాయ స్థితిలో ఉండడంతో గుంటగన్నెల గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు సాల్మాన్ దంపతులు స్థానికులను తీసుకొని అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. జరిగిన విషయాన్ని స్థానికులు వైద్య సిబ్బందికి వివరించారు. అక్కడి వైద్యులు పసికందును వైద్య సేవలు అందిస్తున్నారు. పసికందుకు సంరక్షణగా ఐసిడిఎస్ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్త ఆశా కార్యకర్తలు చూస్తున్నారు. నాలుగు రోజులుగా ఐసిడిఎస్ సిబ్బంది సంరక్షణలో పసికందు వైద్య సేవలు పొందుతుంది. స్పందించిన ఐసిడిఎస్ సిడిపిఓ నీలిమ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రామరాజు గౌరీ దంపతులను పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్ చేసి అంగీకార పత్రాన్ని తీసుకొని పసికందు ఆరోగ్యం మెరుగుపడితే దంపతులకు అప్పగిస్తామని సిడిపిఓ పేర్కొన్నారు.

కించమండ వారపు సంతలో తనిఖీలు

విశాలాంధ్ర - దుంబ్రిగుడ: బాల కార్మిక నిర్మూలన మాసోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని కించమండ వారపు సంతలో అల్లూరి జిల్లా కార్మిక శాఖ జిల్లా ఇన్చార్జి టీ .సుజాత ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారపు సంతలో నిర్వహిస్తున్న ప్రతి దుకాణాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో ఓ కిరాణా దుకాణంలో బాల కార్మికుడు పనిచేస్తుండగా కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇన్చార్జి సుజాత స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

100 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: విశాఖపట్నం నుండి రంపచోడరం వెళుతూ రాజవొమ్మంగి ఫారెస్ట్ రేంజ్ కార్యలయం వద్ద ఆగిన ప్రిన్సిపాల్ సీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) వై మధుసూదనరెడ్డి మాట్లాడుతూ రాష్టంలో అటవీశాఖ ఆధ్వర్యంలో 100 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. మన్యంలో సహజ జలపాతాలు ఎక్కువగా ఉండడంతో పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్నాయని, ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల నిధులతో వాటిని మరింత అభివృద్ధి చేస్తామని, పర్యాటక ప్రాంతంలోనే ట్రెక్కింగ్,పిల్లల పార్కులు,గెస్ట్ రూమ్స్,అవసరమున్నచోట జంతు ప్రదర్శనశాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆయన వెంట స్కాడ్ డిఎఫ్ఓ ఎం త్రిమూర్తులు రెడ్డి, రేంజర్ అబ్బాయి రెడ్డి సిబ్బంది ఉన్నారు.

ఆర్బీకేలకు చేరిన వరి విత్తనాలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: మండలంలోని ఆరు రైతు భరోసా కేంద్రాలకు వరి విత్తనాలు చేరాయని మండల వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు 80 టన్నులకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఇప్పటి వరకు ఆరు కేంద్రాలకు 30 టన్నుల విత్తనాలు చేరాయన్నారు. మిగిలిన వాటికి రాగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపుపై సర్వే

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఈ నెల 26 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపుపై ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు వైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఈ నెల 26 నుంచి 14 రోజుల పాటు ప్రతీ ఇంటికీ వెళ్లి వ్యాధి గుర్తింపుపై సర్వే చేయాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం చేయొద్దని, అనుమానిత కేసుల వివరాలను తమకు తెలియజేయాలన్నారు.

జగనన్న సురక్షపై సమీక్ష

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రం రేకపల్లి సచివాలయ సిబ్బందితో బుధవారం జగనన్న సురక్ష చక్రం పథకం కార్యక్రమం పై సచివాలయ కన్వీనర్ చిక్కాల బాలు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్న సురక్షచక్రం కార్యక్రమాన్ని ఈ నెల 24 నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేఖపల్లి సచివాలయ కన్వీనర్లు చీమల కాంతారావు, కన్నారవు, పంచాయతీ కార్యదర్శి డిజిటల్, అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - దేవీపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న చిన్నారులకు జగనన్న విద్యా కానుక కిట్లును మండల అధ్యక్షుడు కుంజం మురళీ అందజేశారు. దేవారం పంచాయితీ మునినిగుంట ఆశ్రమ బాలికొన్నత పాఠశాలలో ఎంపీటీసీ తుర్రం జగదీశ్ దొర ఇతర వైసిపీ నాయకులతో కలసి విద్యార్థినీలకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, జెడ్పిటీసి శీరసం సత్యవేణి, ఎంపిటీసి గారపాటి మురళీ కృష్ణ విద్యాకమిటీ ఛైర్మెన్ ఎం రవి ప్రసాద్, సచివాలయం కన్వీనర్ లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల డిగ్రీ నూతన విధానంపై అవగాహన

ఉన్నత విద్యమండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి

విశాలాంధ్ర- విశాఖ సిటీ: విద్యార్థికి సంపూర్ణ స్వేచ్ఛను అందించే విధంగా నాలుగు సంవత్సరాల డిగ్రీ విధానం ఉంటుందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి అన్నారు. బుధవారం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నాలుగు సంవత్సరాల డిగ్రీ విద్య విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యూజీసీ సైతం నేడు సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలని భావిస్తోందన్నారు. విద్యార్థి డిగ్రీ కోర్సులో చేరిన సమయంలో మేజర్ సబ్జెక్టును మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రెండో సెమిస్టర్లో విద్యార్థి ఆసక్తికి అనుగుణంగా మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే స్వేచ్ఛ, వెసులుబాటు ఉంటాయన్నారు. 26సంవత్సరాల క్రితం రాష్ట్రంలో సింగిల్ మేజర్ విధానం అమలులో ఉండేదని గుర్తుచేసారు. నాలుగు సంవత్సరాల విద్యా విధానం ఉపయోగాలను వివరించారు. దీనిపై కళాశాలలు, అధ్యాపకులు అపోహలు వీడాలని తెలిపారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన విద్య విధానంలో సూచించిన మార్పులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యధా తధంగా అమలు చేసిన విధానం వివరించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎన్. కిషోర్ బాబు, సీడీసీ డీన్ ఆచార్య సి.ఎన్.వి. సత్యనారాయణ రెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు..

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: నగరంలోని ఏ కేటగిరి రౌడీ షీటర్స్ , సస్పెక్టు షీట్ హోల్డర్స్ కు విశాఖ నగర పోలీసు కమిషనర్ డా. సి.యం.త్రివిక్రమ వర్మ, బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. నగర ఆర్మ్‌డ్ రిజర్వు గ్రౌండ్స్ లో సి.పి , నగర పోలీసు ఉన్నతాధికారులతో కలిసి నగరంలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో గల రౌడీ షీట్ , సస్పెక్టు షీట్ హోల్డర్ల ను పలు కేటగిరిలుగా విభజించి, ఏ కేటగిరి రౌడీ షీట్ , సస్పెక్టు షీట్ హోల్డర్స్ కు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో సీపీ మాట్లాడుతూ ప్రతీ వారం స్టేషన్లలో మీకు కౌన్సిలింగ్ ఇస్తున్నా మీలో ఆశించిన స్థాయిలో మార్పు రావడం లేదు, రౌడీలు, సస్పెక్టులు, పాత నేరస్తుల కదలికలపై ఎల్లవేళలా పోలీసుల దృష్టి ఉంటుందని, ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే ఉపేక్షించకుండా వెంటనే పీడీ యాక్ట్ అమలుపరుచుట, నగర బహిష్కరణ ఉంటాయని, కనుక సత్ప్రవర్తనతో , ఎటువంటి నేరాలకు పాల్పడకుండా ఉండమని లేనిచో పై కఠిన చర్యలు తప్పవని ముందుగా ఈ విషయాన్ని మీకు తెలియపరుస్తూ హెచ్చరించారు.

నాడు నేడు పాఠశాల పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు: నాడు - నేడులో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, గిరిజన సంక్షేమ, ఇంజినీరింగ్, డిఆర్డిఎ అధికారులు, ఏమ్పిడిఓలతో నిర్వహించిన సమీక్షలో కలక్టర్ మాట్లాడుతూ జూలై 10వ తేదీలోగా మరమ్మతులను పూర్తి చేయాలి అన్నారు. 15వ తేదీలోగా విద్యుత్ పనులు, 20వ తేదీలోగా మరుగుదొడ్ల పనులు 25వ తేదీలోగా తాగునీరు పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడత పనులు పూర్తయిన పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్ లు సిద్ధం చేయాలన్నారు. ఎంపిక చేసిన ప్రాథమిక పాటశాలలకు స్మార్ట్ టివిలు, ఉన్నత పాటశాలలకు ఇంటరేక్టివ్ ఫ్లాట్ పేనల్స్ ప్రభుత్వం అందిస్తుందని, అందుకు తగిన ఇంటర్నెట్ కనెక్టివిటి, ఎలక్ట్రికల్ కనెక్టివిటీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమీక్షలో సహాయ కలక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీం భాష, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేయడం తగదు

విశాలాంధ్ర - కూనవరం: పోలవరం నిర్వాసితులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మహపదయాత్ర 2వ రోజు కూనవరం మండలంలో ప్రారంభమై సాగుతువుంది. దానిలో భాగంగా కూళ్లపాడులో జరిగిన విలేకర సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఈ పాద యాత్ర 7 ముంపు మండలాలలో విజయ వాడ వరకు 400కిలోమీటర్లు ఉంటుందని అన్నారు. జగన్ ప్రధాని మోడీ భజన మానుకోవాలి అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడం కన్నా ముందు ముంపు బాధితులకు పునరావాసం, ప్యాకేజీ ఇవ్వాలని అన్నారు. గతేడాది వచ్చిన వరద నష్టపరిహారం కింద పదివేల రూపాయల నష్టపరిహారం ఇస్తానని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి ఊరికి ఒక్కరు ఇద్దరు కి చొప్పున ఇచ్చి చేతులు దు లుపుకున్నారని అన్నారు తెదేపా వైకాపా చెబు తున్నట్టు పోలవరం ప్రాజెక్టు 75% పూర్తి అవ్వ లేదన్నారు. ముస్లిం లకు దళితులకు అండగా ఉంటానంటూ పవన్ కళ్యాణ్ బిజెపితో ఉంటూ చెప్పడం హాస్యాస్పద మని అన్నారు. మీడియా సమా వేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం,వి వెంకటేశ్వర్లు.జిల్లా కార్యర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతా రామయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య. మీ డియా ఇంఛార్జి యర్రంశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి జిల్లా మన్య ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాలైన రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘం అరకు లోయ మండల గౌరవ అధ్యక్షురాలు వి.వి జయ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాడేరు ఏజెన్సీ మారుమూల మన్యప్రాంతమైన కొయ్యూరు మండల పరిధిలోని మూలపేట పంచాయితీ కొండశికర గ్రామమైన కుంబిర్ల గ్రామంలో 45 కుటుంబాలు 20,030 మంది జనాభాతో జీవనం సాగిస్తున్నారని, రహదారి నిర్మాణ లేక సోమవారం పురిటీ నొప్పులు రావడంతో వైద్యం అందుబాటులో లేక పోవడం వల్ల డొలి మోతతో తీసుకొస్తున్న సందర్భంలో మార్గ మధ్య లో చనిపోవడం జరిగిందని ఆమె తెలిపారు. ఇలాంటి దారుణమైన సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా రహదారి సౌకర్యం కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. కొర్ర రోజా 22 సంవత్సరాలు చిన్న వయసులో సకాలం లో వైద్యం అందక తన నూరేళ్ల జీవితం ముగిసి పోయిందని, గతం లో ఇలాంటి సంఘటనలు పదుల సంఖ్యలో సంఖ్య ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె అన్నారు. మృతురాలి కుటుంబానికి 50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ పి.కుమారి, మండల సెక్రటరీ శశికళ, మండల కమిటి మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల మెరుగుకు శ్రీకారం

విశాలాంధ్ర - చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలోని మురుగు కాలువల మెరుగుకు ఇంజనీరింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో స్థానిక ఏరియా ఆసుపత్రి కూడలి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు గల ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు నిర్మాణం చేపట్టారు. స్థానిక పంచాయతీ సర్పంచ్ పుష్పలత, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య లు ప్రత్యేక చొరవ తీసుకొని పలుమార్లు మురుగు కాలువలను శు భ్రపరిచేందుకు చర్యలు చేపట్టడమే గాక, సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలోనూ, ఈ మురుగు కాలువలు నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన పాత్రికేయులు ఎన్నో రకాలుగా కథనాలు ప్రచురించడంతో స్పందించిన స్థానిక జడ్పిటిసి పోతురాజు బాలయ్య నాటి నుంచి మురుగు కాలువ నీరు పోయే మార్గాన్ని మెరుగుపరచాలని రహదారులు భవనముల శాఖ అధికారులను, అదే క్రమంలో పాడేరు ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లడం గాక మండల పరిషత్ సమావేశంలో పలుమార్లు చర్చించినా ఫలితం లేకపోయింది. దీంతో జడ్పిటిసి సభ్యుడు బాలయ్య తన సొంత నిధులు నాలుగు లక్షలు రూపాయలు వెచ్చించడంతో స్పందించిన సర్పంచ్ దురియా పుష్పలత పంచాయతీ నిధులు రెండు లక్షలు కేటాయించారు. ఆరు లక్షల నిధులతో మురుగు నీరు పోయే మార్గాన్ని మెరుగుపరచాలని సూచించడంతో ఇంజనీరింగ్ అధికారులు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువలకు బుధవారం కొలతలు చేపట్టారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని అడవిఅగ్రహారం గ్రామంలో చీడికాడ పశు వైద్యాధికారిని జి గాయత్రీదేవి ఆధ్వర్యంలో గురువారం ఉచితపశు వైద్య శిబిరం నిర్వహించారు. ఐదువేల గొర్రెలు మేకలకు నట్టాల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఈనెల 30 వరకు నట్టాలనివారణ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గొర్రెలు మేకల పెంపకం దారులు సమీప రైతు భరోసా కేంద్రం వద్ద పశుసంవర్ధక సహాయకులను గాని పశువైద్య అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువార్థక సహాయకులు శరగడం గంగునాయుడు రైతులు పాల్గొన్నారు.

సజ్జల దృష్టికి మన్యప్రాంత సమస్యలు

విశాలాంధ్ర - చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహా దారు సజ్జల రామకృష్ణారెడ్డిని స్థానిక ఎంపీపీ కోరారు అనూష దేవి, వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి సమక్షంలో బుధవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల ప్రాదేశిక సభ్యులు యొక్క గౌరవ వేతనముల పెంపు, మండల పరిషత్ అధ్యక్షుల యొక్క వాహన అలెవెన్స్ ల పెంపుదల, అదే క్రమంలో మన్య ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎంపీపీ కోరాబు అనూష దేవి ఫోన్ ద్వారా తెలిపారు.

గ్రామాల్లో జలజీవన్ పథకం శూన్యం

విశాలాంధ్ర - జికేవీధి: జికేవీధి మండలంలో ఉన్న గ్రామాల్లో జలజీవన్ పథకం శూన్యమని సిపిఐ మండల కార్యదర్శి కంకిపాటి సత్తిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల జీవన్ పథకం ద్వారా ఈ ప్రభుత్వం మంచినీరు ప్రజలకు అందించాలనుకుంది కానీ ప్రజలకు అందించడంలో శూన్యమన్నారు. తాగేందుకు మంచినీరు దొరకక కలుషితమైన నీళ్లు తాగి అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకోని వైసిపి ప్రభుత్వం నాయకులు జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి కొళాయిలు ద్వారా మంచినీరు అందిస్తామని చెప్పిన వైసిపి నాయకులు జలజీవన్ పథకంలో బోరు వరకు మాత్రమే శంకుస్థాపన చేశారన్నారు. మండలాల్లో వ్యవసాయ జలకళ బోర్లకు, అలాగే జలజీవన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కృష్ణాదేవిపేటలో జగనన్న సురక్ష

విశాలాంధ్ర - గొలుగొండ: గొలు గొండ మండలం కృష్ణా దేవి పేట సచివాలయంలో ఆర్డిఓ జయరాం అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. పాత కృష్ణా దేవి పేట గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని జగనన్న సురక్ష కార్యక్రమం విధివిధానాలు తెలియజేశారు ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాలన్నీ. ప్రజలకు నేరుగా చేరుతున్నాయా లేదా అనే అంశంపై. అలాగే. మీసేవ కేంద్రాల్లో అందించే సర్టిఫికెట్లు అన్నీ. సచివాలయంలో అందిస్తున్నారా లేదా అని ముఖ్యంగా తొమ్మిది రకాల సర్టి ఫికెట్లు జారీ సక్రమంగా జరుగుతుందా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సెక్రటరీ కిరణమయి, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

విశాలాంధ్ర - చీడికాడ: మండలంలోని జైతవరం గ్రామంలో వ్యవసాయధికారిణి ఏ కృష్ణవేణి ఆధ్వర్యంలో కౌలురైతుల అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలేని వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వం కౌలుపత్రాలు అందజేస్తుందన్నారు. దీనివలన రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రైతుభరోసా విత్తనాలు ఎరువులు పొందుటకు ఈపత్రం ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

23న ఆశీల వేలంపాట

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంతను ఆశీలు వేసేందుకు వేలం పాట వేస్తున్నట్లు ఎంపీడీవో ఆర్వీఎస్ రమేష్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పారిశుద్ధ్య పరిరక్షణ కొరకై వారపు సంత ఆశీలు వసూలు చేసేందుకుగాను 23.6.23 అనగా శుక్రవారం సంత వేలం పాట వేస్తున్నామని వేలం పాటలు పాల్గొనేవారు 5000 రూపాయలు డిపాజిట్ లేనియెడల ధారావత్,సాల్వేషన్ సర్టిఫికెట్ అయిన ఉండలనారు శుక్రవారం జరిగే వేలంపాటి రోజు ముందుగానే పంచాయతీ కార్యదర్శి డిపాజిట్ చేయాలని ఆయన అన్నారు,ఆసీలు ఎంత వసూలు చేయాలనే తదుపరి నిర్ణయం తీసుకుంటామని రేట్లు ప్రకటన చేస్తామని ఎంపీడీవో అన్నారు,సంత వేలం పాట దక్కించుకున్న వారు వచ్చే ఏడది 2024 మార్చి 31 వరకు సంత ఆసీలు వసూలు చేసుకుని అవకాశము ఉంటుందన్నారు. వేలం పాట పాడిన వారికి వారం రోజుల్లోగా పూర్తి అనుమతులు అందిస్తామని వేలంపాట గెలుచుకున్న వారు లక్ష రూపాయలు వరకు డిపాజిట్ చేయవలసి ఉంటుందని ఎంపీడీవో అన్నారు.

సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి సికిల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షలు విజయవంతం చేయాలని ఐటిడిఏ పి ఓ వి. అభిషేక్ ఆదేశించారు. బుధవారం ఆయన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25,26 తేదీలలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి స్థానిక ఎపి ఆర్ జెసిలో ఏర్పాటు చేస్తున్న సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించే అవకాశం ఉందన్నారు. అమేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఏడు వందల మంది విద్యార్థులకు పరీక్షల నిర్వహించడానికి 13 గదులను, పబ్లిక్ కోసం మరో మూడు రూములు ఏర్పాటు చేయాలని సూచించారు. సికిల్ సెల్ ఎనిమియాతో బాధపడే వారందరికి సికిల్ సెల్ ఎనిమీయా పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అంతకు ముందు స్థానిక ఎపిఆర్ కళాశాలను పరిశీలించారు. ఎనిమియా నిర్ధారణ

పరీక్షలు నిర్వహించడానికి అవసరమై ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. జమాల్ భాషా, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డా. కృష్ణారావు, ఎటిడబ్ల్యూ ఓ ఎల్. రజని, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై సిఐడి చీఫ్ వాఖ్యలు దుర్మార్గం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వానికి మహిళలపై గౌరవం లేదు అని పొలిట్ బ్యూరో సభ్యురాలు రాష్ట్రతెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు పై దాడులు ఘోరంగా జరుగుతున్నాయని, గత 10 రోజుల్లో పది దారుణ సంఘటనలు జరిగాయన్నారు. ఏపీ సిఐడి చీఫ్ సంజయ్ మాటలు దారుణంగా ఉన్నాయన్నారు. హత్యాచారా సంఘటనను, మార్గదర్శి ఖాతాదారులను తో పోల్చడం దారుణం అన్నారు. మైనర్ బాలిక కేక్ , చాకలైట్ కోసం లొంగి పోతుందని మాట్లాడం నీచ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. ఈ వైసిపి ప్రభుత్వానికి ఆడపిల్లలు మీద ఇదేనా గౌరవం అన్నారు. సంజయ్ కి మైనర్ బాలిక పై గౌరవం లేదా అని ప్రశ్నించారు. హత్యాచార బాధితురాలితో పోల్చడం దుర్మార్గమన్నారు. ఇలాంటి అధికారులు ఉండటం వల్ల 52 వేలు దాడులు కాదు 60 వేలు దాడులు జరుగుతాయన్నారు.

ఏపీ సీఐడీ చీఫ్ ఆడపిల్లలు కోసం మాట్లాడితే ఏపీ మహిళా కమిషన్ ఛైర్మన్ వాసి రెడ్డి పద్మ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆమెకు సీఐడీ చీఫ్ మాటలు వినిపించలేదా ? కనిపించలేదా? ఐపీఎస్ సంజయ్ కి ఐపీఎస్ సెక్షన్ మర్చిపోయి వైసీపీ సెక్షన్ గుర్తుకొచ్చాయన్నారు. మహిళలకు సిఐడి చీఫ్ సంజయ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని అనిత డిమాండ్ చేశారు.

సచివాలయ శానిటేషన్ సెక్రటరీ వేధింపులు ఆపాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రెటరీ ల అక్రమ సస్పెన్షన్ల ను నిరసిస్తూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్న గతంలో అక్రమ సస్పెండ్ గురైన పీటర్ అనే ఉద్యోగి నీ , 20వ తేదీన వివిధ కారణాలతో అక్రమంగా సస్పెండ్ చేసిన మరో 9 మంది వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లు ను అక్రమ సస్పెండ్ ఎత్తివేయాలని కోరుతూ గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న సహచర ఎన్విరాన్మెంట్ సెక్రటరీ అందరూ దాదాపు గా 500 మంది జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అక్రమ సస్పెండ్ ఎత్తివేయాలని, శానిటేషన్ సెక్రటరీలపై జీవీఎంసీ అధికారులు వేధింపులు ఆపాలని, సీడీఎంఏ ఆదేశాల ప్రకారం సచివాలయ పని వేళలులో ఉద్యోగం చేసే అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు.అనంతరం జీవీఎంసీ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో ఎడిసి వర్మ , చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగుల ప్రతినిధి వర్గంతో చర్చలు నిర్వహించారు. వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ ఉద్యోగులు ముఖ్యంగా మహిళా ఉద్యోగులు

ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలను అధికారులకు వివరించడం జరిగిందన్నారు. సమస్యను అర్థం చేసుకున్న అడిషనల్ కమిషనర్ వర్మ, సీఎంఓహెచ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీ లకు ఉన్న సమస్యలు పరిష్కారంతోపాటు సస్పెండ్ అయిన వారిని అందరిని రేపు సాయంత్రం లోపు రీవోక్ చేపిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీపై ఉద్యోగులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమం పీటర్(రాష్ట్ర ప్రెసిడెంట్) జంగం అహర్నిశల (రాష్ట్ర సహాయ కార్యదర్శి) జీవీఎంసీ వార్డు సచివాలయ ఎన్విరాన్మెంట్ సెక్రటరీల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది.

పోలవరం బాధిత నిర్వాసితుల కోసం నిధుల సేకరణ

విశాలాంధ్ర - చింతపల్లి :- భూములు కోల్పోయిన పోలవరం బాధిత నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిలువునా ముంచాయని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భోసంగి చిన్నయ్య పడాల్ అన్నారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 4 తేదీ వరకు.14 రోజుల పాటు సుమారు 400 కిలోమీటర్లు పోలవరం పోరు కేక పాదయాత్ర సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతుందని ఈ పాదయాత్రకు మద్దతుగా బుధవారం చింతపల్లి వారపు సంతలో సిపిఎం కార్యకర్తలు విరాళాలు సేకరించారు. సేకరించిన విరాళాలను జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర కేంద్రానికి పంపిస్తామని తెలియజేశారు. పాదయాత్ర ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు అందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పునరావాస పరిహారం ఇవ్వాలని, 1986 ,2022 వరదల్లో మునిగిన గ్రామాలన్నింటిని మొదటి దశ పునరావాసంలో కలపాలని, గోదావరి వరదల నుండి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని, గత ఏడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, తప్పులతడకగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలని డిమాండ్ చేస్తూ ఈ పాదయాత్ర సాగుతుందన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్ మండల కమిటీ సభ్యులు సాగిన చిరంజీవి కిల్లో సింహాచలం మజ్జి రాంబాబు మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు పాంగి జీవన్ కృష్ణ, కొర్ర కార్తీక్ తదితయులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలు అందక నిండు గర్భిణి మృతి

విశాలాంధ్ర - కొయ్యూరు : గ్రామానికి కనీస రహదారి సౌకర్యం లేక సకాలంలో వైద్యసేవలు అందక ప్రసవ వేదనతో డోలిమోతలోనే నిండు గర్భిణి తనువు చాలించిన హృదయ విషాదకర ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తి కావస్తున్న నేటికీ మారుమూల ప్రాంత గిరిజనుల జీవన స్థితిగతులు మారడం లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యంలోని పలు గ్రామాలకు నేటికీ సరైన రహదారి రవాణా సౌకర్యాలు లేక గిరిజనం అనాగరికులు గాని జీవిస్తున్నారు. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోని మారుమూల గ్రామాల ప్రజలకు విద్య వైద్యం త్రాగునీరు రవాణా వంటివి నేటికీ అందని ద్రాక్ష గానే ఉన్నాయి. మిషన్ కనెక్ట్ పాడేరు పథకంలో మారుమూల గ్రామాలకు రహదారులు నిర్మిస్తామన్న అధికారుల ప్రకటనలు మన్యంలో పూర్తిగా కార్యరూపం దాల్చక పోవడంతో నేటికీ డోలిమోతలు తప్పడం లేదు. కొయ్యూరు మండలం బూదరాళ్ల యు.చిడిపాలెం మతం భీమవరం మంప మూలపేట తదితర పంచాయతీలోని పలు మారుమూల గ్రామాలకు నేటికి రహదారి సౌకర్యం లేకపోవడంతో రోగులను గర్భిణీలను ఆసుపత్రికి తరలించేందుకు డోలిమోతలు మోయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే మంగళవారం మూలపేట పంచాయతీ మారుమూల కుంబుర్ల గ్రామానికి చెందిన నిండు గర్భిణీ పాంగి రోజా (20)

పురిటినొప్పులతో బాధపడుతుండగా కుటుంబీకులు గ్రామస్తుల సాయంతో డోలిమోతతో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవ వేదన అధికమై మృతి చెందింది. కుంబుర్లు గ్రామం నుండి డౌనూరు పిహెచ్సి కి తరలించాలంటే ఎనిమిది కిలోమీటర్లు కాలినడకన రావాల్సిందేనని ఈ నేపథ్యంలోనే గర్భిణీ రోజాను డోలిమోతలో తీసుకువస్తుండగా మార్గమధ్యలోనే కడతేరిపోయిందని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. రహదారి సౌకర్యం ఉండుంటే తమ బిడ్డను కాపాడుకోగలిగే వారిమని బోరున విలపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఐటీడీఏ పీవో ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు స్పందించి మౌలిక సదుపాయాల మాటెలా ఉన్నా కనీస రహదారి సౌకర్యం కల్పించాలని కుంబుర్ల గ్రామ ఆదివాసి గిరిజనులు వేడుకుంటున్నారు.

బాధిత కుటుంబానికి టీడీపీ చేయూత

విశాలాంధ్ర - దేవీపట్నం: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలో రెండు రోజుల క్రితం ఎస్సీ కాలనీ లో చిడిపి వెంకటరమణ కు చెందిన తాటాకిల్లు కరెంట్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికి ఆహుతి అయ్యి మూడు లక్షల రూపాయలు వరకూ ఆస్తి నష్టం జరగడంతో వారు నిరాశ్రయులయ్యారు. మండల టీడీపీ నాయకులు వారిని పరామర్శించి రంపచోడవరం నియోజకవర్గం టీడీపీ ఉపాధ్యక్షురాలు కారం పోచమ్మ ఆధ్వర్యంలో నెలకు సరిపడా నిత్యవసర సరుకులు 50 కిలోల బియ్యం మరియు దుస్తులు బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షులు

మాగాపు బాబూరావు రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోళ్ళ చంటిబాబు వల్లపాటి నాగేశ్వరావు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మార్కండేయులు మృతి

విశాలాంధ్ర - హుకుంపేట: అనారోగ్యం సమస్యతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. దీనిని సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గత్తుం పంచాయతీ చీకటిపుట్టు గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న కొర్రా మార్కండేయులు గత కొన్ని రోజులుగా అనారోగ్యం సమస్యతో భాధపడుతు బుధవారం తెల్లవారు జామున పాడేరు జిల్లా ఆసుపత్రిలో మృతి చెందాడు. ఈయన పీఆర్టీయూ ఉపాధ్యా యుల రాష్ట్ర అధ్యక్షుడు పని చేసి అనేక ఉద్యమాలు, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేసి విజయాలు సాధించారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు మార్కండేయుల స్వగ్రామమైన గూడ లో అంత్యక్రియలు నిర్వహించారు. ఈవిషయం తెలువుకున్న ఉపాధ్యాయ సంఘల నాయకులు, ఉద్యోగసంఘల నాయకులు, పలుపార్టీల నాయకులు గూడ గ్రామం చేరుకొని ఉపాధ్యాయుడికి కన్నీటి విడ్కోలు పలికారు. పలువురు నాయకులు ఉపాధ్యాయుడు పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

జగనన్న సురక్షపై అవగాహన

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట పంచాయతీ సచివాలయంలో బుధవారం' జగనన్న సురక్ష "అనే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని స్థానిక సర్పంచ్ వెంకటపూర్ణిమ తెలిపారు. ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేసే సర్టిఫికె ట్లను ఉచితంగా ఇవ్వనున్నారని తెలిపారు. కుల, నివాస, ఇన్కమ్, డేటోబార్తు, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నెంబర్ అప్డేట్, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డు నమోదు, కౌలు గుర్తింపు కార్డులు వంటివి ఫీజు లేకుండా ఈ నెల 24 వ తేదీ నుంచి నెల రోజులు ఉచితం గా అందించనున్నట్లు చెప్పారు. దీనిని గ్రామంలోకి తీసుకుని వాలంటర్స్ వెళ్ళాలిని అలాగే గృహ సారదులు,కన్వీనర్లను కలువుకొని ఈ కార్యక్రమంనికి ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని తెలిపారు. సచివాలయంలో పరిధిలోని ఉన్న ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ చంద్ర, విఆర్ఓ కొండబాబు, కన్వీనర్లు , సచివాల యంసిబ్బంది,వాలంటర్స్,వార్డ్ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: జగనన్న సురక్ష పథకం ఈనెల 24న ప్రారంభించనున్నట్లు ఆ పథకం గురించి జేసీఎస్ కన్వీనర్ ఆవులు మరియదాసు వివరించారు. సచివాలయ సిబ్బంది గృహ సారథులు వాలంటీర్ల సమావేశం జగ్గవరం కూనవరంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా 13 రకాల ధ్రువపత్రాలను వాలంటీర్లు నేరుగా ఇంటికే తీసుకొచ్చి ఇస్తారని అలాంటి అవకాశం ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు .కులము ఆదాయము నివాస భూమి హక్కు పత్రాలు జనన మరణ ధ్రువపత్రాలు నేరుగా ఇంటికి వచ్చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూనవరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్, జగవరం సర్పంచ్ కారం పార్వతి, ఎంపీపీ పాయం రంగమ్మ, జడ్పిటిసి గుజ్జ విజయబాబు, కూనవరం సెక్రటరీ సురేష్, మేరుకుల కార్పొరేషన్ డైరెక్టర్ డీకొండ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పంపించే బాధ్యత తల్లిదండ్రులదే

విశాలాంధ్ర దుంబ్రిగూడ: విద్యార్థులను ప్రతిరోజు పాఠశాలకు పంపించ బాధ్యత వారి తల్లితండ్రులదేనని కొర్రాయి పంచాయతీ సర్పంచ్ పి.కొములు చెప్పారు. మండలంలోని కొర్రాయి పంచాయతీ గత్తర జిల్లెడ ఎంపీపీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి పరిశీలించారు.

అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం సప్లై చేసిన విద్యా కానుక కిట్లను, యూనిఫామ్ బట్టలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా విద్యా కానుక కిట్లు ను,యూనిఫామ్ బట్టలను ,బూట్లను పంపిణీ చేస్తుందన్నారు. వీటిని ఉపయోగించి గిరి విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బి భోల, ఆ గ్రామ పెద్దలు కే గిరిబాబు ,కే దోన్ను, కె రామచంద్రరావు ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని తాడిపుట్టు పంచాయితీ గడుగుపల్లి గ్రామంలో నూతన భవన నిర్మాణానికి అరకు ఎంపీ లాడ్స్ నిధులు క్రింద 10 లక్షల రూపాయలు నిధులు కేటాయిం చడం జరిగిందని జేడ్పిటిసి రేగం మాత్యలింగం తెలిపారు. బుధవారం గడుగుపల్లి గ్రామాన్ని సందర్శిం చి గ్రామస్తులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గడుగుపల్లి గ్రామానికి నిధులు కేటాయించిన అరకు ఎంపీ గొట్టేటి మాధవికి గ్రామ స్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపా రు. గతంలో ఏ ప్రభుత్వం మా గ్రామానికి ఎటువంటి నిర్మాణాలు చేపట్టాలని అలాంటిది ఇప్పటి వైఎస్ ఆర్ ప్రభుత్వం మాపై కరుణ చూపి పది లక్షల రూపాయలు ఇవ్వడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో సూకురు ఎంపీటీసీ పిలగాడ సింహాచలం. సర్పంచ్ సోమరి సత్యవతి సోమిలి లక్ష్మయ్య , ఇంజనీరింగ్ అసిస్టెంట్, వైఎస్ఆర్ సిపి నాయకులు తమర్బ రాజారావుపడాల్, కిరిసాని సుబ్బారావు, వాలంటీర్ సత్యనారాయణ, గృహ సారథులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర- చోడవరం : ఇటీవల మందపల్లి వెళుతూ మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో మరణించిన ముద్దుర్తి గ్రామ స్తుల వారి కుటుంబీకులకు వైఎస్సార్ భీమా నగదును బుదవారం అందజేశారు. మృతులు ఒక్కొకరికి రూ:10000-00లు. చొప్పున మొత్తం 6 గురు కుటుంబ సభ్యులకు అందజేశారు. వారిలో 1,) పతివాడ. పార్వతి.2) గంగిరెడ్డి. విజయ 3) బోడి. సత్యవతి 4) బోడి వరలక్ష్మి.5) బోడి. దేముడమ్మ.6) బొచ్చా. సత్యవతి లు వున్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ. పల్ల రమణ. సర్పంచ్ కె.లక్ష్మి, సచివాలయ కన్వీనర్స్ మోసూరి శ్రీనువాస రావు, అప్పలస్వామి నాయుడు, ఎస్.శ్రీను, బోడి సూరి బాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుగుణ, వి.ఓ.ఏ, వాలంటీర్లు, వై.సి.పి. నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తుపై విచారణ

విశాలాంధ్ర మాకవరపాలెం: మాకవరపాలెం మండలం రామన్నపాలెంకు చెందిన అన్‌రాక్ భూనిర్వాసితుడైనా విత్తనాల నూకరాజు ఇచ్చిన స్పందనలో దరఖాస్తుపై మంగళవారం తహశీల్దార్ ప్రసాదరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అనంతరం నూకరాజును అడిగి సైట్‌కి సంబందించిన ఎల్పిసి, గతంలో ఆన్‌రాక్ కంపెనీకి ఇచ్చిన రెండు ఎకరాలకు సంబందించిన డాక్యుమెంట్స్‌ను పరిశీలించి విచారణ చేశారు. వచ్చిన పిర్యాదు పై తదుపరి విచారణకు శనివారం ఆర్డీవో కార్యాలయానికి రామాలని చెప్పారు.

గ్రామ వాలంటీర్లకు జగనన్న సురక్ష పథకంపై శిక్షణ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలో గల కొల్లాపూటు పంచాయితీ సచివాలయం కేంద్రంలో బుధవారం స్థానిక సర్పంచ్ పి.రామ్మూర్తి అధ్యక్షతన సెక్రటరీ మహాలక్ష్మి పర్యవేక్షణలో గ్రామ వాలంటీర్లకు, గృహ సారథులకు జగనన్న సురక్ష పథకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రామ్మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం విజయవంతం అయ్యేంతవరకు అందరూ కలిసి సమిష్టితో పని చేయాలన్నారు. అనంతరం సెక్రెటరీ మహాలక్ష్మి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం యొక్క ముఖ్య ఉద్దేశం వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది గ్రామ వాలంటీర్లు నేచర్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ జె.చలం గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: యోగా ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున అన్నారు. బుధవారం ఉదయం స్వర్ణ స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, నగర మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ , జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ తో కలిసి పాల్గొని యోగా సాధన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలని,యోగా వలన మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. అనంతరం డాక్టర్ గౌతమ్, గీతం డెంటల్ కాలేజ్ రచించిన ' యోగా అండ్ డెంటల్ హైజీన్' , అదేవిధంగా ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ తులసీరావ్ రచించిన ' యోగా తెరపి ఫర్ హైపర్ టెన్షన్ ' పుస్తకాలను గౌరవ అతిధులుచే ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం అతిధులను ఆయుష్ శాఖ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి , ఆయుష్ శాఖ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు, ఆయుష్ వైద్యాధికారులు, పతాంజలి, ఆర్ట్ ఆఫ్ లివింగ్, నేచర్ క్యూర్ , పుష్పాంజలి ,ఆంధ్ర యూనివర్సిటీ యోగా విలేజ్ , వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి పాల్గొన్న ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో అనేక గ్రామాలు, పాఠశాలల్లో బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జిల్లా వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీ, వికాస తరంగణి ఆద్వర్యంలో నిర్వహించిన యెగా డే కార్యక్రమాలు విశేషంగా

అలరించాయి. ఆయుర్వేద ఆసుప్రతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌కుమార్, సర్పంచ్ ఏడిద నూకరత్నం, డిసిఎంఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అయినంపూడి మణిరాజు, అవతారంరాజు, దశరధరాజు, హెచ్‌ఎం నర్సింగరావు, వికాస తరంగణి చీఫ్ కోఆర్డినేటర్ సుజాత తదితరులు యోగా పోటిల్లో గెలుపొందిన విజేతకు బహుమతులు ప్రశంపత్రాలు అందజేసారు. యోగా ఇన్స్ట్రక్టర్లు పార్వతిదేవి, రాంబాబు పర్యవేక్షణలో బాలబాలికలు చేసిన యోగాసనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పిడి రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: స్థానిక అవంతి కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం నిర్వహించారు. అవంతి ఎన్ఎస్ఎస్ యూనిట్, రామచంద్ర మిషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామచంద్రమిషన్ జోనల్ కోఆర్డినేటర్ వి.లక్ష్మయ్య హాజరై మాట్లాడారు. శరీరానికి దారుఢ్యం ఎంత అవసరమో మనసుకు కూడా మానసిక దారుఢ్యం అవసరం, మానసిక దారుఢ్యన్ని పెంచడం కోసం ఒత్తిని

నియంత్రించాలన్నారు. అందుకు గాను యోగా, ప్రాణాయామం వంటివి ప్రతీ రోజు చేయాలని, తద్వారా ఎల్లప్పుడూ మానసిక ఉల్లాసంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌రావు, ఆర్ట్ ఆఫ్ విలింగ్ టీచర్స్ జలుమూరి గిరిబాబు, దివాన వెంకటగిరి, రామచంద్ర మిషన్ సభ్యులు, రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ శిక్షణ సభ్యులు, 80 మంది అధ్యాపకులు, 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా అన్నారు. సింహాద్రి సంయుక్త హాల్లో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే యోగ ఉత్తమమైన సాధనమని

పేర్కొన్నారు. అనంతరం పలువురి యోగా గురువుల పర్యవేక్షణలో సింహాద్రి అధికారులు, కుటుంబ సభ్యులు వివిధ యోగాసనాలు చేసారు. ఈ కార్యక్ర మంలో విపిజి చీఫ్ జనరల్ మేనేజర్ బి. రామారావు, సీపిజి-3 చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. గోవిందరాజన్, ఓ అండ్ ఎం జిఎం డిపి పాత్ర, హెచ్‌ఆర్ హెచ్ఓ రూమాడి శర్మ, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, యోగా చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవివిఎస్ మూర్తి, డివి శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (యన్ యస్ యస్) ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా శిక్షణ, అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఏటా జూన్ 21న యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. యోగా ప్రాముఖ్యత ప్రపంచ వ్యాప్తంగా అందరికీ తెలిసిందన్నారు.

యోగాసనాలు క్రమంతప్పకుండా చేస్తే శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ జి.హారతి, అధ్యాపకులు జి. వెంకటరావు, అప్పనమ్మ, శకుంతల, శైలజ, నాగమోహన్ రావు,రాజబాబు,శ్రీదేవి,రమేష్,సాయికుమార్,ఇమ్మానియేలు, అలివేలు మరియు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్ 80ఫీట్ రోడ్డులో ఉన్న దాట్ల కన్వెన్షన్‌లో పతంజలి యోగ విద్య ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వేడుకలు

నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శింపజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యోగాకు 5 వేల సంవత్సరాల చరిత్ర ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పతాంజలి యోగ విద్య ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధులు, యోగ సభ్యులు పాల్గొన్నారు.

మ్యాటర్ ఎరాకు అపూర్వ స్పందన

విశాలాంధ్ర -విశాఖ సిటీ: భారతదేశపు మొట్టమొదటి ఎలక్ట్రిక్ గేర్డ్ మోటర్‌బైక్, మ్యాటర్ ఎరా, మార్కెట్లోకి విడుదల అయిన ఒక నెలలోపే దేశవ్యాప్తంగా 40,000 మంది కి చేరువయ్యింది. మ్యాటర్ ఎరా, నిజంగా ఎలక్ట్రిక్ మోటర్‌బైక్‌ల యుగం ఎట్టకేలకు వచ్చిందని రుజువు చేసిందని మ్యాటర్ వ్యవస్థాపకులు మోహన్ లాల్ భాయ్ చెప్పారు. ప్రీ-బుకింగ్‌లు కంపెనీ వెబ్‌సైట్‌లో ఫ్లిప్‌కార్ట్, ఒటో క్యాపిటల్‌తో సహా భాగస్వామి పర్యావరణ వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్నాయన్నారు. మ్యాటర్ ఎరా కేవలం సాధారణ మోటర్‌బైక్ మాత్రమే కాదు, ఇది రైడింగ్ యొక్క భవిష్యత్తు పరంగా గణనీయమైన మార్పును సూచిస్తుందన్నారు.